క్లుప్తంగా

శివశరణ స్వామిజీకి ఘన నివాళి



పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ గ్రామ చిన్నగాజులగుట్టపై నిర్మించిన సత్యనారాయణ స్వామి ఆలయ సముదాయంలో గురువారం శివశరణ స్వామిజీ ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వామి భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు మాయం

ఖిల్లాఘనపురం: ఖాతాదారునికి తెలియకుండా బ్యాంక్ ఖాతా నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు డ్రా చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన ఖిల్లాఘనపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన సింగనమోని కృష్ణయ్య మహబూబ్‌నగర్‌లో హోమ్‌గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. అతని ఖాతా నుంచి తనకు తెలియకుండా బుధవారం రూ.2 వేలు డ్రా చేసినట్లు మెసేజ్ రావడంతో ఆందోళనకు గురయ్యాడు. బ్యాంకుకు వెళ్లి ఖాతాను పరిశీలించగా మొత్తం రూ.14,300 డ్రా చేసినట్లు తెలిపారు. డబ్బులు ఏటీఎం ద్వారా డ్రా చేసినట్లు చెప్పడంతో షాక్‌కు గురయ్యాడు. తన ఏటీఎంను ఎవరో దొంగిలించినట్లు గురువారం ఖిల్లాఘనపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ఆదిశిలావాసుడికి బంగారు కర్ణాలు వితరణ



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారికి గురువారం ధరూరు మండలం మన్నాపురానికి చెందిన శ్యాంరావు దంపతులు రూ.1లక్ష విలువ చేసే బంగారు పూత పూసిన కర్ణాలను వితరణ చేశారు. అంతకు ముందు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు వారిని శాలువాతో సత్కరించి మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, ధీరేంద్రదాసు, రవిచారి, అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడికి ఘన నివాళి

వీపనగండ్ల: పేద ప్రజల బాగు కోసం అహర్నిశలు పనిచేసిన సీపీఎం నాయకుడు కామ్రేడ్ ఎద్దుల లక్ష్మయ్యకు పార్టీ మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు నాగిరెడ్డిలు ఘనంగా నివాళులర్పించారు. గురువారం బొల్లారంలో లక్ష్మయ్య మృతదేహానికి పూలమాలలు వేశారు. గ్రామంలో పేద ప్రజల కోసం అనునిత్యం తపించే వ్యక్తి మరణించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య, బాలగౌడ్, రామకృష్ణ, తిరుపతయ్య, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

వరిలో చీడపీడలను నివారించాలి



మహమ్మదాబాద్: వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి వెంకటేష్ సూచించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిపంటకు ఆశిస్తున్న చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరిలో కాండం తొలిచే పురుగు ఆశిస్తే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. వీటి నివారణ చర్యలను ఆయన రైతులకు వివరించారు. లింగాకర్షక బుట్టలను అమర్చాలని సూచించారు. పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టి, అధిక దిగుబడులు సాధించాలని కోరారు.



కొత్తకోటలోని అంబ భవానీ ఆలయంలో లలితాదేవిగా దర్శనమిచ్చిన భవానీమాత



కన్యకాపరమేశ్వరి ఆలయంలో బాల త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



కానాయపల్లి కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో జ్ఞానాంబికాదేవి బాలత్రిపుర సందరిదేవి



మదనాపురం కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



పాన్‌గల్ మండలం కేతేపల్లిలో..

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



ఆత్మకూర్‌లోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



కానాయపల్లి కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



పాన్‌గల్ మండలం కేతేపల్లిలో అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఆర్యవైశ్య నాయకులు



ఆత్మకూర్‌లో కేశవనగర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



అమరచింత కాళికామాత ఆలయంలో బాలత్రిపుర సుందరిగా అమ్మవారు

సాక్షి, నెట్‌వర్క్: వనపర్తి మండలంలోని చిట్యాల, సవాయిగూడెంలో బాలత్రిపుర సుందరిదేవిగా అమ్మవారు భక్తులకి దర్శనమిచ్చారు. శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో, పెబ్బేరు పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు.

⇨ కొత్తకోట మండలంలోని కానాయపల్లి గ్రామ సమీపంలోని శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీజ్ఞానాంభికాదేవి బాలత్రిపుర సందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరి మాతగా దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య మహిళలు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తాజా మాజీ ఎంపీపీ గుంతమౌనిక దంపతులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ విశ్వనాథం వెంకటరమణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. భవానీ మాత ఆలయంలో లలితాదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

⇨ మదనాపురంలో దుర్గామాత బాల త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

⇨ పాన్‌గల్ మండలంలోని కేతేపల్లిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర దేవిగా దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు వీరప్రతాప్, చంద్రమౌళి, రాంబాబు, శ్రీనివాస్, మురళీధర్, యాదగిరి, మాణిక్యం, నవీన్, వెంకటేష్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

⇨ అమరచింత పట్టణంలోని కాళికామాత ఆలయంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా భక్తుల దర్శనమిచ్చారు. పట్టణంలోని జగన్‌వాడ, సంతోష్‌నగర్, శివాజీ నగర్, బీసీ కాలనీ, ధర్మాపురం, ఈర్లదిన్నెలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

⇨ ఆత్మకూర్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయం, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయం, నీల కంఠేశ్వర ఆలయం, కేశవనగర్, వాల్మీకి నగర్‌లలో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు.

చిన్నారి మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళన

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణానికి చెందిన ప్రియాంక గత నెల 22న వనపర్తి సృష్టి ఆస్పత్రిలో సాధారణ కాన్పు అనంతరం చిన్నారి మృతి చెందడంతో బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. పెబ్బేరు పట్టణానికి చెందిన ప్రియాంకను కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లికి చెందిన అశోక్‌తో పెళ్లి చేశారు. ప్రియాంకకు మొదటి కాన్పులో బిడ్డపుట్టి చనిపోయింది. రెండోసారి ప్రెగ్నెన్సీ తర్వాత వనపర్తి పట్టణంలోని సృష్టి ఆస్పత్రిలో 9నెలలు వైద్య పరీక్షలు చేయించారు. సెప్టెంబర్ 22న వైద్య పరీక్షల కోసం సృష్టి ఆస్పత్రికి వచ్చింది. ఆమెను పరిశీలించిన వైద్యులు బీపీ ఎక్కువగా ఉందని, ఆస్పత్రిలో చేరాలని సూచించారు. ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా, ఈ నెల1న వైద్యులు సాధారణ కాన్పు చేశారు. 2న మధ్యాహ్నం డిశ్చార్జి చేయడంతో పెబ్బేర్ వెళ్లిపోయారు. 3వ తేదిన రాత్రి చిన్నారి అస్వస్థతకు గురి కావడంతో ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందింది. దీంతో వైద్యుల నిర్లక్ష్య వల్లే చిన్నారి చనిపోయిందని, చిన్నారి మృతదేహంతో బంధువులు గురువారం ఉదయం సృష్టి ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకొని వారికి సర్దిచెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేష్

అమరచింత: సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామాల్లో నేరాలను నియంత్రించే అవకాశం ఉందని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మండలంలోని మిట్టనందిమళ్లలో సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వంద మంది పోలీసులు చేసే పనిని ఒక్క సీసీ కెమెరా చేస్తుందన్నారు. గ్రామ ప్రజలందరూ ఆర్థికంగా సహకరించి వచ్చిన డబ్బులతో గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే, వాటి పనితీరును పోలీస్ స్టేషన్ నుంచి మానిటరింగ్ చేస్తూ నేరాలు నియంత్రిస్తామన్నారు. దాతలు ముందుకొచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సర్వారెడ్డి, వెంకటన్నతో పాటు పలువురు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణయ్య

వనపర్తిటౌన్: విద్యార్థులు చదువుతో పాటు న్యాయ విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు డి.కృష్ణయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన పెంచుకుంటే జీవితంలో ఒక్కసారైన ఉపయోపడతాయన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. మహిళలు తమ చట్టాలను తెలుసుకొని ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకోవాలన్నారు. మహిళా చట్టాలు, బాల్యవివాహాలు, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో బాల్యవివాహాలను అరికడతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.రఘు, నసీమా, నీలమ్మ, లోక్ అదాలత్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్థిక సాయం



యాపర్లలో గ్రామస్తులకు చెక్కును అందజేస్తున్న సూదిరెడ్డి శ్రీహరిరెడ్డి

వనపర్తి రూరల్: పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో పూర్వ విద్యార్థి రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. పెబ్బేరు మండలంలోని యాపర్ల గ్రామానికి చెందిన సూదిరెడ్డి శ్రీహరిరెడ్డి పెద్దల పండుగ సందర్భంగా వచ్చాడు. తాను చదువుకున్న పాఠశాలను సందర్శించాడు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో దాన్ని చూసిన ఆయన చలించి పోయాడు. పాఠశాల మరమ్మతుల కోసం స్పందించి రూ.50 వేల ఆర్థిక సహాయం గురువారం గ్రామస్తులకు అందజేశారు. అవసరమైతే ఇంకా సహాయం అందిస్తానని తెలిపారు. పాఠశాలకు ఆర్థిక సహాయం అందించిన సూదిరెడ్డి శ్రీహరిరెడ్డిని ఎచ్‌ఎం శంకర్‌గౌడ్, గ్రామస్తులు, విద్యార్థులు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

పాదయాత్రలో విశ్రాంత ఉద్యోగి



మాట్లాడుతున్న విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి

ఉండవెల్లి: పిల్లలకు పాఠాలు మాత్రమే కాదు, వారి భవిష్యత్ కోసం అందరు ఆలోచించాలని జోగుళాంబ అమ్మవారి ఆలయం నుంచి విశ్రాంత జిల్లా విద్యాశాఖ అధికారి శివార్చక విజయ్‌కుమార్ బాపు బాటలో సత్యశోధన పాదయత్రలో రెండో రోజు ఉండవెల్లిలో మాట్లాడారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌లో మాట్లాడారు. విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకురావాలంటే ఉపాధ్యాయులదే కీలక పాత్ర ఉంటుందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు దేవన్న, వెంకట్రామయ్య శెట్టి, వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



కొత్తకోట రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ సమీపంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో వైద్య ఆరోగ్య, విద్యుత్, తాగునీటి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తకోటలోని ప్రతి వీధిలో సీసీ రోడ్లు, అవసరం ఉన్నచోట డ్రెయినేజీలు నిర్మించాలని, సీసీ రోడ్ల నిర్మాణానికి ముందు తాగునీటి పైప్‌లైన్లు వేయాలన్నారు. అమృత్ పథకం ద్వారా నీటిట్యాంకులు, పైప్‌లైన్లను సమస్య ఉన్న కాలనీలు, నూతనంగా ఏర్పాటైన కాలనీల్లో నిర్మించాలని సూచించారు. భవిష్యత్‌లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అభివృద్ధి పనులకు నిధుల లోటు లేకుండా చూసుకుంటానని భరోసానిచ్చారు. పాత గ్రామపంచాయతీ స్థలంలోనే పుర కార్యాలయ భవనాన్ని నిర్మించేందుకు అవకాశాలను పరిశీలించాలని కోరారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా కొత్త ఫీడర్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పురపాలిక ఈఈ విజయ్, ఏఈ భాస్కర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, పి.కృష్ణారెడ్డి, ఎన్‌జే బోయేజ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, గొల్లబాబు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడిగా బాలచంద్రయ్య

కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా కె.బాలచంద్రయ్యను నియమిస్తూ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి గురువారం నియామక పత్రం అందజేశారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతం కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించినట్టు ఉపాధ్యక్షులుగా ఎన్నికైన కె.బాలచంద్రయ్య తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మేస్త్రీ శ్రీనివాసులు, పి.కృష్ణారెడ్డి, ఎన్‌జె.బోయేజ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, సంద వెంకటేష్, బాలరాజు యాదవ్, దిలీప్‌రెడ్డి, నవీన్ రెడ్డి, శ్రీకాంత్ ఉన్నారు.

దాడి కేసులో ముగ్గురిపై కేసు నమోదు

పాన్‌గల్: దాడి చేసిన సంఘటనపై గురువారం ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. మండలంలోని జమ్మాపూర్‌కు చెందిన బోయిని రామకృష్ణకు, బోయిని సుగ్రీవుడు కుటుంబానికి బావి మోటార్ విషయంలో మనస్పార్థలు ఉన్నాయి. ఈ విషయం సామరస్యంగా మాట్లాడుకుందామని గురువారం ఉదయం గ్రామ ప్రభుత్వ పాఠశాల ముందు రోడ్డుపై ఇరు కుటుంబాల వారు చేరారు. మాట మాట పెరిగి వాగ్వాదానికి దారి తీసింది. దీంతో నల్లపోతుల భరత్, బోయిని సుకేందర్, బోయిని సుగ్రీవుడులు కలిసి బోయిని రామకృష్ణ అతని కుమారుడు నాగేష్‌పై దాడి చేశారు. ఈ సంఘటనలో రామకృష్ణ కింద దవడ రెండు పళ్లు ఊడిపోగా, కుమారుడు నాగేష్ మేడకు, కుడి చేతికి గాయాలయ్యాయి. రామకృష్ణ ఫిర్యాదు మేరకు దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేతేపల్లిలో మూఢనమ్మకాలపై అవగాహన

సాక్షి ఎఫెక్ట్..



మూఢ నమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

పాన్‌గల్: 'సాక్షి' దినపత్రికలో గురువారం ప్రచురితమైన 'కేతేపల్లిలో క్షుద్ర పూజల కలకలం' అనే వార్తకు పోలీసులు స్పందించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో గ్రామానికి వెళ్లి గుండ్ల చెరువుకు వెళ్లే దారిలో వేసిన మనిషి బొమ్మను నీటితో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించారు. ఎవరూ మూఢ నమ్మకాలు నమ్మవద్దని, చేతబడి, క్షుద్ర పూజలు లేవని చైతన్యంతో జీవించాలన్నారు. గ్రామంలో ఇలాంటి పూజలు చేసే వారు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం



అజ్జకొల్లులో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లులో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులను గురువారం గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. నిఖిల్, ప్రీతి, నిహారిక, నిఖితలు గ్రామానికి గొప్ప పేరు తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బ్రహ్మమ్మ సత్యం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, కురువ నరసింహులు, రాములు గౌడ్, రాజిరెడ్డి, నారాయణ, పర్శరామ్ రెడ్డి, బ్రహ్మయ్యచారి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గోపాల్‌పేట విద్యార్థులు



రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం రమాకాంత్, పీడీ సురేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల 27న జోగుళాంబ గద్వాల జిల్లాలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. వారిని రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారని, అందులో గోపాల్‌పేట విద్యార్థులు ఉన్నారని తెలిపారు. అక్టోబరు 5 నుంచి 7వ తేదీ వరకు మెదక్ జిల్లా సిద్దిపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రశాంత్, మహేష్‌లు ఎంపికైనట్లు తెలిపారు. అక్టోబరు 6 నుంచి 8వ తేదీ వరకు ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు మీనాక్షి, ప్రణవి, శిరీషలు ఎంపికై నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఆశా వర్కర్లకు పనిభారం తగ్గించాలి



వనపర్తిలో డీఎంహెచ్ఓకు వినతి పత్రం అందజేస్తున్న ఆశాలు

వనపర్తి రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బుచ్చమ్మ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు, కార్యదర్శి పుట్ట ఆంజనేయులు హాజరై మాట్లాడారు. ఆశా వర్కర్లకు ఎలాంటి ట్రైనింగ్ ఇవ్వకుండా బీపీ, షుగర్ టెస్టులు చేయాలని అధికారుల ఒత్తిడి తెస్తున్నారన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ చేయాల్సిన పనులు ఆశా వర్కర్లతో చేయిస్తున్నారన్నారు. ఎలాంటి ట్రైనింగ్ లేనటువంటి ఆశా వర్కర్లతో టెస్టులు చేయించడం రాష్ట్రంలో ఎక్కడా లేదని, ఇది వనపర్తి జిల్లాలోనే చేయించడం సరికాదన్నారు. అదనపు పనులకు అదనపు పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారుల వేధింపులు ఆపాలని తదితర డిమాండ్లతో కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశాలకు సంబంధం లేని పనులను చేయించరాదని ఈ నెల 7న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు యూనియన్ జిల్లా కార్యదర్శి కె సునిత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, యూనియన్ నాయకులు గిరిజ, ఇందిర, చిట్టెమ్మ, శాంతమ్మ, శ్యామల, సుజాత, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు

మానవపాడు: మండలంలోని ఆరోగ్యకేంద్ర పరిధిలోని ఆయా గ్రామాల్లో గురువారం ఆరోగ్యకేంద్ర సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలలో నీటిని నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మురుగు కాల్వలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.